'ప్రపంచంలో గోదానం, భూదానం, సువర్ణదానం, తండుల దానం, ఆఖరికి తిలదానం చెయ్యడం సులభంగా వుంది. కన్యాదానం చెయ్యడమొక్కటే కష్టమైపోయింది. ఆడపిల్ల ఇష్టపడి వెడతానంటుంటే- ఆ దానం పట్టేవాడుమాత్రం డబ్బు కావాలంటాడు - మనిషి జీవితం పశువుకన్నా హీనమైపోయింది' అనుకున్నారు.

ఆయనకి ప్రపంచరీతి, చిత్రంగా, విచిత్రంగా అనిపిస్తోంది.

— "స్వాతి" సెప్టెంబర్ 1984.

# ఆత్మ (హత్య) కథ

'బాపూ గీయనిబొమ్మవా? కృష్ణశాస్త్రి రాయని పాటవా; మాకాలేజి వార్షికోత్సవం సందర్భంగా ఓ కుర్రాడు రాసి పాడిన పాట ఇది. అది నన్ను ఉద్దేశించి రాసిన పాట అని అతనికి కాదు-నాకూ తెల్సు.... అందరికీ తెలుసు,

అతని గుండెల అంతరాంతరాలలో నామీదఉన్న అభిప్రాయాన్ని అరాధనని పాటరూపంలో వినిపించాడే కాని-అంతకు మించి చొరవ తీసుకొని నన్నేమీ అడగనూ లేదు. అతనుఏదైనా కోరివుంటే ఏమయ్యేది అన్నది ఇప్పుడు చచ్చుప్రశ్న.

అతని ముఖం నాకిప్పటికి జ్ఞాపకంపే ఏవీ అడగలేని అమాయకత్వం ఏవీ గెల్చుకోలేని అలౌకికం....

తర్వాత్తర్వాత అపాట మా కాలేజీలో చాలామంది నోటికివచ్చేసింది. కాలేజీలో, బస్టాండులో, రిక్షాలో రోడ్‌మీద నెనెక్కడ కనిపించినా చాలామంది కుర్రాళ్ళు అపాటలోని రెండువాక్యాలు వల్లెవేసేవారు. అందుకు వాళ్ళమీద నాకు కోపం వచ్చేదికాదుసరికదా....గర్వంకలిగేది.

నిజమే నేను బాపు బొమ్మలాగే వుంటాను.

కృష్ణశాస్త్రి పాటలంటే నాకు ఇష్టమే....

నేను అందంగా ఉంటానని నాకు మిడిసిపాటు లేదు కాని కొంచెం గర్వం ఉంది. కొందరు తమకున్న మంచి డిగ్రీకి గర్వపడతారు. కొందరు తమది గొప్పవంశమని గర్వపడతారు. మరికొందరు తమకున్న మంచి భర్తల గురించి; భార్యల గురించి గర్వపడతారు. ఇంకొందరు తమకున్న ఆస్థిగురించి, అంతస్థుగురించి గర్వపడతారు.

గర్వం రకరకాలు....

సృష్టి ప్రతిమనిషి గర్వపడేందుకు ఏదో ఒకటి అందిస్తుంది. ఇది తెల్సుకోలేని వాళ్ళమాత్రం నిరాశ జనకమైన జీవితాన్ని గడుపుతారు,

నేను నిరాశజీవిని కాదు.

ఆశగా జీవించడానికి నాకు అందం వుంది.

సోయగం, అంతకుమించి హొయలు వుంది.

తిలక్ మాటల్లో "పృదు వక్షోజనితంబ భారమై యావ్వనధనస్సులా ఒంగిపోతూ" వుంటాను.

నా కున్న రెండో అలంకారం....సిగ్గు.

సిగ్గులో 'శి, ఎన్నో వంకర్లుపోతూ శిగ్గుగా కనిపిస్తుంది. అందుకే భాషాదోషమైనా అలాగేరాస్తాను.

సిగ్గు ఆడదానికి అందం-అని తెలియకముందే నాకు అదంటే

ఇష్టంఏర్పడింది. శోయగం, శిగ్గు అందం కన్నా అందంగా ఉంటాయని నా ఉద్దేశ్యం.

నాకీ అలంకారాలన్నీ ఉన్నాయని తెల్సుకున్న కొత్తలోనే.... అతను మా యింటికొచ్చాడు,

మావాళ్ళు అతన్నిగౌరవించారు. యెంతో గౌరవించారు, "ప్రిన్స్ ఛార్మింగ్ డార్లింగ్ అవ్ ది మిలియన్స్",ని గౌరవించినట్టు గౌరవించారు.

అతను ప్రిన్సూ కాదూ ఛార్మింగ్‌గానూ లేడు.

అప్పటికి నా డార్లింగూ కాలేదు.

కాని మనదేశంలో పెళ్ళికొడుకుని చూపుల కొచ్చినప్పుడు అలా చూడటం రివాజు....

అతను నల్లగాఉంటాడు. నేను ఎర్రగావుంటాను కదాని నలుపంటే నాకు అయిష్టత లేదు. రాత్రి నల్లగానే వుంటుంది. అయినా దానివిలువ దానిదే!

అతను మోటుగా, రఫ్‌గా వుంటాడు. అయినా నాకు అయిష్టతలేదు వృక్షము, తీగ పోలిక నాకు నచ్చుతుంది.

అతను యింజినీయర్....

పెద్దపెద్ద రోడ్లువేయించేవాళ్ళకి- చిన్నహృదయం ఉండేదని ఎక్కడా దాఖలాలేదు. ఆ చిన్ని హృదయానికి కనీసం చేతిగడియాగాని కున్న స్పందనైనా ఉంటుంది.

అతను నన్ను చూశాడు.

మళ్ళీ మళ్ళీ చూశాడు.

మార్చి మార్చి చూశాడు.

గుడ్లప్పగించి నన్నుచూస్తున్నప్పుడే నాకు దొరకిపోయాడు. క్లీన్‌బోర్డ్....

ఏదో తప్పుచేసినవాడిలా అటుఇటు కదిలాడు.

అప్పుడే....సరిగ్గా అప్పుడే నా గుండె కిసుక్కున నవ్వింది.

గుండె ప్రసారచేసిన ఆ 'కిసుక్కు'ని ఒకెగా మార్చి తర్వాత మానాన్నకి చెప్పాను.

పదహారువేలు కట్నం....

పదహారువేలు అనగానే నాకు క్రిష్టుడు జ్ఞాపకం వస్తాడు. మన సంప్రదాయంలో అర్థంకాని గొప్పవింత- ఏకపతీవ్రతుడైన రాముణ్ణి, పదహారువేల మంది భార్యలున్న క్రిష్ణున్ని ఒకేలాపూజిస్తాం....యుగ యుగానికి ధర్మం మారుతుందని ఆయనెవరో రామాలయంలో మైకులో చెప్పారని మానాయనమ్మ నాకు మైకులేకుండా చెప్పింది.

పదహారువేలివ్వడం కలియుగధర్మం.

పదహారువేలు గుమ్మరించాల్సి వచ్చినందుకు నాకు మానాన్నమీద జాలీలేదు. గుమ్మరించమన్నారని వాళ్ళమీద కోపవూలేదు.

మెడిసన్ చదువుతున్న అన్నయ్యకి పాతికవేలు వస్తాయని నాన్న అమ్మతో పెరుగన్నం తింటూ చెప్పడం నేవిన్నాను. యింజనీర్ తండ్రికి పెళ్ళికెదిగిన ఇద్దరు ఆడపిల్లలున్నారు. ఆయనకూడా ఎన్నో కొన్నివేలు గుమ్మరిస్తాడు.

అందరూ బేలన్స్ అయిపోతారు.

ఇది కలియుగధర్మమని తర్వాత యుగాల మైకుల్లోనో, లేకుండానో రామాలయంలోనో, శివాలయంలోనో చెప్పుకుంటారు, నాకా నమ్మకం వుంది.

నా పెళ్ళి బాగా జరిగింది. కాదు....జరిపారు.

ఆ విషయం నాకు చాలామందిచెప్పారు. అంతేకాకుండా నా పెళ్ళి ఫొటోలు అందుకు సాక్ష్యాలు. అందుకు నేను సాక్షినికాను, ఎందుకంటే అకాస్సేపు నేనుఊహల్లో ఉన్నాను. మత్తులోఉన్నాను. అసలు ఏ మనిషి నైనా ఆవాతావరణం అలా చేస్తుందేవో....

సంప్రదాయం, మంత్రాలు, అగ్ని, పట్టుచీరల పరిపరలు, ఘుమ ఘుమల్లు, కొత్తకలయికల పలకరింపులు. పాతపరిచయాల నవ్వులు,

కళ్ళల్లో కాటుక ప్రూామం తాలూకుపొగ. అది రగిల్చేమంట గుండెల్లో స్పదులు, పక్క-గుండె సవ్వడులు వినాలన్న ఆత్రుత. వంకరతిప్పే సిగ్గు. నుదుమీదటడే శిరోజాలు, బుగ్గమీద చెరిగినచుక్క, తెమలినితంతు, తెమలెదేమని విసుగు, తెమిలిపోతుందెమోన్న భయం-ఏవో....ఏవో.... ఏవో ఫీలింగ్స్

తర్వాత మొదటిరాత్రి గదిలోకి గెంటిన ముత్తయిదువుల కాఠిన్యం.... అది శస్త్రచికిత్సచేసే డాక్టర్ కాఠిన్యంలాంటిది. నీ సుఖం కోరి నిన్ను బాధపెడుతున్నాను.

లోపలికెళ్ళాక చేతుల్లో మొహం దాచుకున్నాను. అయినా వేళ్ళ సందుల్లోంచి చూస్తూనే వున్నాను. అరచేతుల్నిండా గోరింటాకు....

"మందారంలా పూస్తే
మంచి మొగుడొస్తాడు"
మందారంలాగే పూసింది.
మరి ఎలాంటి.... ?

ఏవిటో ఆ రాత్రంతా నాకే తెలియని ఉద్వేగం, భయం, థ్రిల్లు.... మనిషి మనసుకి కలిగే అన్ని భావాలు, అనుభూతులు చుట్టు ముట్టేసి, ముళ్ళల్లా గుచ్చేసి.... కరిచేసి....

నేనేం మాట్టాడలేదు.

చిత్రం ఆయనకూడా ఏవీ మాట్టాడలేదు.

మాట్టాడిన కాసేపు- తన ఉద్యోగం, జీతం, తన బాస్.... నా పరిస్థితి- 'గుండె గొంతుకలోన కొట్టాడుతాది.' ఆయన పరిస్థితి ఏవిటో నాకప్పుడూ తెలియదు- ఇప్పుడూ తెలియదు.

అడిగితే- "అట్లాంటి విషయాలు పెళ్ళాంతో చర్చించడం నా కిష్టంలేదు" అన్నారోసారి. ఇప్పుడడిగినా అదే మాటంటారు.

"మరి ఎవరితో చర్చిస్తారు?" అని నేనడగలేదు. అలాంటి ప్రశ్నలు సరదాకూడా అడదీ అడగకూడదన్నది అయన అభిప్రాయం.

ఆ రాత్రి అలా గడిచిపోయింది. రాత్రిలా, చీకటిలా.... ఇంత సౌందర్యాన్ని ఎదురుగా పెట్టుకుని ఆయన లైటెందుకు తీసేశారో నా కిప్పటికీ అర్థంకాదు.

ఆ రాత్రి ఆయన్ని నేచూళ్లేదు. నన్ను నన్నుగా ఆయనా చూడ లేదు.

కంగారుగా, భయంగా, గిల్టీగా....

రెండు మెలికలు, నాలుగువంపులు, మూడుక్షణాలు.

ఆ రాత్రి నాకు తృప్తి నిచ్చిందా? అసంతృప్తి నిచ్చిందా? అని నిలేసి అడిగితే నేనేవీ చెప్పలేను.

అసలారాత్రి ఎలా వుంటుందో నాకు ముందుగా తెలియదు కాబట్టి— ఆ రాత్రిమీదకాని, ఆయనమీద కాని ఫిర్యాదు చెయ్యడం లేదు.

కాని తర్వాత్తరువాత నా జీవితంలో చాలా రాత్రిళ్ళు గడిచాయి. అయినా స్థూలంగా ఆయన నా కర్థం కాలేదు.

ప్రేమలేని మొగాళ్ళు కొందరు.

ప్రేమవున్నా వ్యక్తపరచలేని వాళ్ళు కొందరు,

లేని ప్రేమను ప్రకటించేవారు కొందరు.

పెళ్ళాల్లో రకాలున్నట్టే- మొగుళ్ళలోకూడా రకాలున్నారు. ఈయన ఏ రకమో నేనర్థం చేసుకోలేకపోయాను. నా దగ్గరున్న బి.యస్సీ డిగ్రీకాని, నే నిష్టపడే దేవులపల్లి, తిలక్, చలం రచనలు కాని- యేవీ అందుకుపయోగపడలేదు.

ఓ మంచి పలకరింపు, ఓ కవ్వింత, ఓ చిన్న సరసం.... ఏవీ ఉండదు. పెళ్ళానికి లోకువై పోతానేమోనన్న భయం కాబోలు....

ఎప్పుడూ పులిలా గాండ్రు గాండ్రుమంటూ

ఆయన అభిప్రాయాలు చాలా చిత్రంగా వుంటాయి. సంఘంలో అవినీతి, వ్యభిచారం పెరిగిపోతోందని ఆయన ఆందోళన-

ఆడవాళ్ళు దరిద్రంగా డ్రెస్ చేసుకుంటున్నారని ఆయన బాధ పడిపోతారు.

వాళ్ళ డ్రెస్సుల్నీ వాటి వంపుసొంపుల్ని చూడందే ఆయనకెలా తెల్సింది.

వ్యభిచారంకన్నా మానసిక వ్యభిచారం మరింత దోషంకాదా? 'మాట్లాడితే మా తాతయ్య బతికుంటే ?' అంటారు____ తాతయ్యల్ని అందరూ ప్రేమిస్తారు. కాని ఎనభై ఏళ్ళకు చచ్చిపోయిన తాతయ్య ఇంకా బతకలేదని బాధపడే యువకుల్ని నేనుకూడా చూళ్లేదు.

తలుపులేసుకున్న పడగ్గదిలోకూడా ఆయన్ని 'నువ్వు' అని నేననకూడదు.

ఆడది గేటులో నుంచోకూడదు.

గేటులో నుంచోకూడదని ఆంక్షపెట్టి_ గేటు తీసుకుని వెళ్ళిపోయే ఆడదాన్ని ఎన్నాళ్ళు ఎవరయినా ఆపగలరు?

కవిత్వం ఆయనికి అర్థంకాదు కాబట్టి అదంతా చెత్త.... చెత్త కాబట్టి నేను చదవకూడదు. చలంవి అస్సలు చదవకూడదని వాళ్ళ నాయనమ్మ చచ్చిపోయేటప్పుడు చెప్పిందట. అంచేత నా చెలం పుస్తకాలన్నీ బాయిలర్‌లో పడేశారు.

ఎదురింటి అబ్బాయి చెయ్యి ఊపుతున్నాడని చెప్తే వాడిచేతికేసి ఎవరు చూడమన్నారు? అనడిగారు.

నాకు నవ్వొచ్చింది.

అసలా కుర్రాణ్ణి ఈయన చెర్మం ఒలిచేసి, జైలుకెళ్ళిపోయినా_ నేను ఆనందంగా ఆయనికి కేరేజ్ తీసకెళ్లేదాన్ని.

నాకు నచ్చిన కాటన్ చీరకి స్టార్చ్‌పెట్టి ఇస్త్రీ చేసి కట్టుకుని, ఉన్నంతలో అలంకరణ చేసుకుని సాయంత్రం ఆయనకోసం కాచుకు నుంటే____

"ఏంటా భోగం వేషాలు?" అన్నారు.

అలంకరణ వాళ్ళకే జన్మహక్కా? మరొకళ్ళకి కాదా?

ఇంట్లో వుండేది ఆయన, అత్తగారు, మావగారు ఇద్దరాడపడుచులు, ఇద్దరు చిన్న మరుదులు.

నేను "భోగం కాదండీ- భోగం" అంటే

"మొహం పగుల్తుంది" అన్నారు.

ఓ రాత్రివేళ దీపం ఆర్పేసి చెమటవాసన నిండిన శరీరాన్ని నా పక్కకు చేర్చి- చీకట్లో—

రెండు మెలికల్లు, నాలుగు వంపులు, మూడుక్షణాలు ఇది యే వేషం.... ఇదే పవిత్రతా?

"స్త్రీకూడా శరీరం వుంది. దానికి వ్యాయామం ఇవ్వాలి.

ఆమెకు మెదడు వుంది జ్ఞానం ఇవ్వాలి.

ఆమెకి హృదయం వుంది. దానికి అనుభవం ఇవ్వాలి" అని అని అస్సలోచించని మనిషి....

స్పందింప చెయ్యడంలేదు- సంకేతాలు పలకవ్.... బురదలో గొడ్డు దొర్లినట్టు....

రాత్రి ఆయన ఎలా వుంటారో నాకిప్పటికీ తెలియదు. ఆ మొహంలో పగులిడే రక్తాన్ని చూద్దామని పిచ్చి ఆశ....

ఎప్పుడో రాత్రివేళ నేను నిద్రపోయాక లైటు ఆర్పేసి- చెమట వాసనకి మెలకువ వస్తుంది. నోటితో గాలిపీల్చడం మొదలెడతాను. ఈ శరీరం నాదికాదు. దానికి అనుభూతుల్లు లేవు. అదీ మంచంలాగే జడపదార్థమైపోతుంది. స్పందించాల్సిన గుండెలు కొయ్య బారిపోతాయ్. పెదాలు టైరుముక్కల్లా.... అవయవాలు, వాటిని కదిలించే నరాలు, నాడులు- అన్నీ పులకించాల్సిందిపోయి సమ్మె చేస్తాయి.

మూడు క్షణాలు- ఊపిరిబిగపట్టుకుంటే ఈ బాధ,ఈరొద, ఈ నరకం వదుల్తుంది-అనిపిస్తుంది.

తీరా తర్వాత కళ్ళుమంటలు, నరాలబాధ, తలతిరుగుడు, ఎదురు తిరిగే శరీరం....

రాత్రిని బద్దలుకొట్టేద్దామన్నంత కసి.

ఛీ- పగలేబాగుంటుంది.

"నీతనువు నా కౌగిలిని తట్టిద్దానమై సాగి,"

నాన్సెన్స్ మెరిసి, ఉరిమి, వర్షించాల్సిన మనిషిని కాలిపోతాను.

ఈ రాత్రులిలా ఉండకూడదని తెల్సింది. వీటిల్లో ఏదో అసహజత్వం, అసంపూర్ణత——

చెప్పుకోవల్సిన మనిషికి చెప్పుకోడానికి అంక్షలు- చెప్పుకున్నా ప్రయోజనం....

ఒక్కసారి తను నా ఒళ్ళంతా పులకింపజేస్తే ఎంత బాగుండును?

మగాడికి సిగ్గు డిస్క్వాలిఫికేషన్.

తరిమి, తరిమి పట్టుకుని చెరపట్టి అందంగా హాయిగా హింసించాల్సిన పేటగాడు....

తరవడు తరివించుకోడు,

విశ్వరహస్యం మొత్తం మూడుక్షణాల్లో....

నేనే ప్రశ్నన్ని-నేనే సమాధానాన్ని.

మనిషికి తెలియకపోవడం సహజం-

తెల్సుకోనని మొండికెయ్యడం క్షమార్హం కాదు.

సెక్స్‌ఈడ్రం అది చీకటి కార్యక్రమం అనుకునేవాళ్ళు పెళ్ళిళ్ళు చేసుకోకూడదు.

అది ఒక ప్రాకృతిక క్రమం, క్రతువు, యోగం, యజ్ఞం.... ఒక అనిర్వచనీయమైన సౌందర్యపిపాస

అది మూడుక్షణాల చీకటిపని అనుకుని వాళ్ళని ఐ. పి. సి. 302 క్రింద ఉరితీసెయ్యాలి. అలా అనుకోవడం సృష్టినే కించపరచడం లాంటిది.

శుభ్రత లేని వాళ్ళందర్నీ యావజ్జీవ కారాగార శిక్షవిధించాలి.

రాను రాను నాకీ శుభ్రత మీద అసహ్యత పుట్టింది. రెండు రోజులకి లోపావడా, బ్రా మార్చుకుంటాను. పౌడరన్నా, స్నో అన్నా అసహ్యం- పువ్వులంటే జుగుప్స....

నా అందాన్నీ, హాయిల్నీ, నాసొగసుని నేనే మర్చిపోయాను.

మరలాంటిరొచ్చులో, రొష్టులో చెమటకంపులో మురికి మనసులో ఇరుక్కున్న నాకు విముక్తి ఏమిటి?

జీవితం గుడిపాటి వెంకట చలం చెప్పినంత సులభం కాదు- దలేసుకుంటూ వెళ్ళిపోవడానికి.

నన్ను ఆదరించే మామగారు, నాకు గొప్ప కోడలుందని చెప్పుకుని, చెప్పుకుని మురిసిపోయే అత్తగారు, కూతురు "చక్కగా" కాపురం చేసుకుంటోందని ఆనందపడే తలిదండ్రులు....

ఒక్క మనిషిమీద కక్షతో.... నా సుఖంకోసం వీళ్ళందర్నీ శిక్షించడంఎలా? ఆయనమీంచి నడిచెళ్ళిపోడం సుఖమా?

పగలంతా పులిలా ప్రవర్తించేమనిషి రాత్రికూడా పులైపోతే ఎంతబాగుండును?

ఇలా.... అశాంతితో, అసంతృప్తితో, అసంపూర్ణతతో ఎన్ని సంవత్సరాలు గడిచాయి.

సంవత్సరానికి 365 రోజులు, రోజుకి ఇరవై నాలుగుగంటలు. గంటకి అరవై నిమిషాలు.... నిముషానికి అరవై సెకండ్లు....

మూడు క్షణాలకి ఓ నరకం చొప్పున సంవత్సరానికెన్ని? ఎవరు చెప్తారు ?

లెక్కల మాష్టార్లా? మానసిక శాస్త్రవేత్తలా ? స్త్రీ జనాభ్యుదయ వాదులా ? రచయితలా? కవులా ?

ఆఁ....

అప్పుడోసారి నేను పుట్టింటి కెళ్ళాను- యేదో పండగకి. నే నక్కడుండగానే నాయనమ్మకి జబ్బు చేసింది. హాస్పిటల్లో చేర్చారు. నాయనమ్మ పోలేదని బాధపడుతున్న రోజులు.

ముదిరిన రోగంతో, పెరిగిన వయసులో బాధపడుతూ నరకం అనుభవిస్తోంది.

(వృద్ధస్త్రీల నరకములు వేరు- పడుచు స్త్రీల నరకములు వేరు)

ఆవిడ ఇక్కడి నరకంనుండి తప్పించుకోవాలంటే వేరే నరకానికో, స్వర్గానికో వెళ్ళాల్సి వుంటుంది. నిజం చెప్పొద్దూ- ఆవిడ పోవాలనే నేను ప్రార్థించుచున్నాను.

అప్పుడు అమ్మ, నాన్న- నాయనమ్మను చూస్తూ హాస్పిటల్లో వుండేవారు. నేను, తమ్ముళ్ళు, చెల్లెలు ఇంట్లో.... మాకు తోడుగా నాన్నకి తెల్సిన అబ్బాయి వుండేవాడు. చాలా మంచాడు. నాన్నకి అతనంటే ఎంతో ఇష్టం. చౌకవయినా తెల్లటి బట్టలు వేసుకుని కడిగిన ముత్యంలా వుండేవాడు. రోజూ రాత్రిళ్ళు మేం ఏన్నో కబుర్లు చెప్పుకునేవాళ్ళం....

డాబామీద కూర్చుని చుక్కల దూరాన్ని చూపుల జానలతో కొలిచేవాళ్ళం. "ఆకాశంలో ఆ మణిదీపాలు ఎవరుంచారో" తెల్సుకుందామన్న తాపత్రయం.

అతను తెలుగు కవిత్వంనుంచి పాశ్చాత్య తత్త్వశాస్త్రం వరకు అన్నీ చదివినవాడు. జీవితాన్ని ప్రేమించినవాడు.

సృష్టిలోని సౌందర్యాన్నంతనీ అర్థంచేసుకుని, ఆకళింపు చేసుకుని- అనుభవించే కళ్ళు, పలవరించే గొంతు ఉన్నవాడు.

అతని దృష్టిలో స్త్రీ సృష్టిమొత్తం సృష్టిమొత్తానికే గొప్ప. ప్రాకృతచాతుర్యం స్త్రీ సృష్టిలోనే కనిపిస్తుంది.

స్త్రీ అవయవ నిర్మాణం, ఆలోచనా సరళి ప్రపంచానికే కొత్త వెలుగుని, సోయగాన్ని కల్పించింది.

బీజాన్ని తనలో నింపుకుని, మరో జీవిని తనలో ప్రతిష్టించు కుని- సృష్టికే ప్రతిసృష్టి చెయ్యగల నేర్పు, చాతుర్యం 'ఆడ'తనానికే ఉంది.

అలాంటి స్త్రీని గౌరవించలేని, పూజించలేని, ఆరాధించలేని, ప్రేమించలేని సమాజం ఆటవిక సమాజమని అతని ఉద్దేశ్యం.

అలా మేం నాల్గురోజులు మాటాడుకున్నాం. ఆ తర్వాతరోజే నేను నిర్ణయం తీసుకున్నాను. ఎంతో ఆలోచించి- ఉద్విగ్నతతో, ఆశతో, ఆరాటంతో....

ఆ రాత్రి.... చాలారోజుల తర్వాత.... బతుక్కి అర్థం తెలుసు కున్నదానిలా.... తెల్లటి మల్లెపువ్వులా తయారయిన నేను—

—కడిగిన ముత్యందగ్గర వాలిపోయాను.

సృష్టికి, స్థితికి, లయకి కారణమైన అనుభూతుల పర్వం, అనుభ వాల పంట....

రాత్రికి ఎంత విలువ వుందో అప్పుడే తెల్సింది నాకు. నా ఊపిరి నేనే పీల్చాను. రాత్రి మగాడు ఎలా వుంటాడో, ఎలా వుండాలో అప్పుడే తెల్సింది నాకు.

తన చూపుల ముళ్ళతో నా అణువణువూ....

మూడుక్షణాల అసంపూర్ణ, అసంతృప్తి జీవితానికి అలవాటుపడ్డ నేను- ఆ రాత్రి సుఖాన్ని, హాయిని, ఆనందాన్ని, తృప్తిని కొల్లగొట్టు కున్నాను.

తప్పుచేశానని అనుకోలేదు. కాని ఎవరికేనా తెలిస్తే ఆత్మహత్య చేసుకుందామని మాత్రం అనుకున్నాను. ఆ ఒక్కరాత్రి అనుభవపు స్మృతిని గుండెల్లో దాచుకుంటానని, నా చేయి నిమిరి అతను వెళ్ళి పోయాడు.

• • •

నాకు పెళ్ళయ్యి ఆరేళ్ళయ్యింది.

ఇద్దర్ను పిల్లలుకూడా కలిగారు—

మా మావగారు ఇప్పటికీ నన్ను ఆదరిస్తారు. మా అత్తగారు నాకు గొప్ప కోడలుందని చెప్పుకుని మురిసిపోతారు. నా తలిదండ్రులు తమ కూతురు 'చక్కగా' కాపురం చేసుకుంటోందని ఆనందపడు తుంటారు.

ప్రతి రాత్రి లైటు తీసేశాక- చెమట వాసనకి మెలకువవస్తుంది. ఊపిరి బిగపట్టి....

అప్పుడు నేను ఆత్మహత్య చేసుకుంటాను. అంటే నన్ను నేను చంపుకోను. నా ఆత్మ నా శరీరంనుంచి విడివడి ఎక్కడికో వెళ్ళి పోతుంది. ఆ రాత్రి కడిగిన ముత్యంలో కలిగిన అనుభవం జ్ఞాపకం వస్తుంది. అతనే కళ్ళముందు కదుల్తాడు.

నా శరీరం ఎక్కడుందో నాకు తెలియదు.

"మధురమైన జ్ఞాపకాలు
మనిషి కొకటి రెండు చాలు
వ్యథాతప్త హృదయవీధి
సుధావృష్టి కురిసేందుకు"
హాయిగా నిద్రపోతాను.

— "స్వాతి" జూన్ 1982.